క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

పుంగనూరు: నియోజకవర్గంలోని మున్సిపాలిటీ సహా ఆరు మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. పుంగనూరు మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఇర్ఫాన్ బాషా, పుంగనూరు మండల అధ్యక్షుడిగా అమరనాథరెడ్డి, చౌడేపల్లెకు జి.నాగభూషణరెడ్డి, సోమలకు మత్స్యం గంగాధరం, సదుంకు చింతల రెడ్డెప్పరెడ్డి, పులిచెర్లకు చెరుకు నాదమునిరెడ్డి, రొంపిచెర్లకు కరీముల్లాను నియమించారు.

పలమనేరు యువతికి అవార్డు


యసస్విత

పలమనేరు: పట్టణానికి చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ విజయ శేఖర్ కుమార్తె యసస్విత బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో ఎంటెక్ (సీఎస్ఈ)లో ఈ ఏడాదికి బెస్ట్ ఔట్ స్టాండింగ్ స్టూడెంట్‌గా నిలిచిందని కళాశాల హెడ్ రంజిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి మంచి పేరు తెచ్చిన యసస్వితను పట్టణ వాసులు అభినందనలు తెలిపారు.

గంగజాతర దుకాణాలకు వేలం

పలమనేరు: పట్టణంలో ఈనెల 30న గంగచాటు నిర్వహించనున్న నేపథ్యంలో మే నెల 13 నుంచి 17 దాకా పట్టణంలోని గంగమ్మ ఆలయం వద్ద జరిగే జాతరలో ఆలయంలోపల, వెలుపల విద్యుద్దీపాల డెకరేషన్, చలువ పందిళ్లు, పూల దండలు, అమ్మవారికి అలంకరణ కోసం తక్కువ కొటేషన్ ఇచ్చిన వారికి అవకాశం కల్పించనున్నట్టు ఆలయ ఈఓ కమలాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆలయ ఈఓను సంప్రదించాలని పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతపై సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లి: స్థానిక అగస్థీ పబ్లిక్ స్కూల్‌లో పది ఫలితాల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాఠశాల యాజమాన్యం గురువారం చెక్‌పోస్టు కూడలి వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉత్తీర్ణత శాతం సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. అగస్థీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం


నివాళులర్పిస్తున్న నేతలు, అధికారులు

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాల అమలుకు పంచాయతీరాజ్ ఉద్యోగస్తులు నిబద్ధతతో పనిచేస్తున్నారని ఎంపీడీఓ బాలాజి చెప్పారు. మనమిత్ర యాప్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ జీడీ బాబు, పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి, ఎంఈఓ గోపాల్‌రెడ్డి, వెలుగు ఏపీఎం మీరాబాయి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు న్యాయం చేయాలి

కుప్పం: సెట్ పరీక్ష కేంద్రాల్లో బ్రాహ్మణ విద్యార్థులకు జరిగిన అవమానంపై రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడు శ్రీనివాస మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రం బీదర్, షిమోగా పట్టణాల్లో బ్రాహ్మణ విద్యార్థుల యగ్నోపవీతంను కత్తిరించి చెత్త కుప్పతొట్టిలో వేయడం దారుణం అన్నారు. విద్యార్థుల పట్ల, హిందూ మత వ్యతిరేక ధోరణితో బ్రాహ్మణ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాకుండా చేసే కుట్ర పన్నినట్లు తెలుస్తోందన్నారు. సంఘటనపై కర్ణాటక ప్రభుత్వం తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

బస్సులో చైన్ చోరీ


బాధితురాలు శిరీష

పలమనేరు: బస్సులోని మహిళ బ్యాగులో ఉంచుకున్న చైన్ చోరీ అయిన సంఘటన పలమనేరు బస్టాండ్‌లో గురువారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. చౌడేపల్లి మండలం కొండామర్రికి చెందిన శిరీష తన స్వగ్రామానికి వెళ్లేందుకు పలమనేరు నుంచి చౌడేపల్లి బస్సు ఎక్కింది. ఇంతలో ఓ మహిళ తన వద్ద డబ్బు పోయిందంటూ బస్సు దిగేసింది. దీంతో శిరీష సైతం తన బ్యాగులో పెట్టుకున్న బంగారు చైన్‌ను గమనించగా అది కనిపించలేదు. దీంతో ఎవరో దొంగిలించాతని గట్టిగా అరవడంతో స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. బస్సులోని ప్రయాణికులను తనిఖీ చేశారు. కానీ బంగారు చైన్ లభించలేదు. సుమారు 12 గ్రాముల చైన్ ధర రూ.లక్ష వరకు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బస్సులోంచి ముందుగా దిగిన మహిళపై అనుమానంతో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పరిశీలిస్తున్నారు.

కీలుబొమ్మలుగా ఎంపీడీఓలు

- కూటమి నేతలు చెప్పినట్టే పనులు మంజూరు
- జేబులు నింపుకుంటున్న కూటమి నేతలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీపీలా.. డోంట్‌కేర్ అంటున్న ఎంపీడీఓలు
- అన్ని మండలాల్లోనూ ఇదే ఎంపీడీఓల వ్యవహారశైలి


పలమనేరు ఎంపీడీఓ తీరుపై నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు(ఫైల్)


పలమనేరు గ్రీవెన్స్‌డేలో పెద్దపంజాణి ఎంపీడీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మాజీ ఎంపీపీ మురళీకృష్ణ (ఫైల్)

పలమనేరు: నియోజకవర్గంలో స్థానిక సంస్థలకు సంబంధించి సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందినవారే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా మండలాల ప్రజాప్రతినిధుల మాటలను అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఎంపీడీఓలు కూటమి నేతలు తానా అంటే తందానా అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా అన్ని మండలాల్లో మండల మీట్‌లను సైతం ప్రజాప్రతినిధులు వాయిదాలేస్తున్నారు. కానీ మీరేమైనా చేసుకోండని మేము మాత్రం అధికార పార్టీకి తొత్తులుగానే ఉంటామంటూ ముందుకెళుతున్నారు.

గంగవరం మండలంలో..

తాజాగా మండలంలో జరిగిన మండల మీట్‌లో ఎంపీడీఓ తీరుపై మండల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ నిధుల ద్వారా రూ.50లక్షలతో చేపట్టాల్సిన పనులకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు వర్క్‌ఆర్డర్ ఇవ్వలేదు. అయితే కూటమి నేతలకు మాత్రం పనులు కల్పించేశారు.

పెద్దపంజాణి మండలంలో..

బసవరాజుకండ్రిగ గ్రామంలో పనిచేస్తున్న తాగునీటి బోరు చెడిపోయిందని దీంతో గ్రామంలో తాగునీటి సమస్య ఉందని అక్కడి నేత ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆపై ఆఘమేగాలపై 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి కొత్త బోరు కోసం గత జనవరిలో రూ.1.85లక్షలను అధికారులు మంజూరు చేశారు. ఇందుకు మోటార్‌ను పట్టణంలోని ఓ షాపులో కొన్నట్టు దొంగ బిల్లులు పొంది గత మార్చి 24న మోటార్‌ను అమర్చినట్టు సంబంధిత ఎంపీడీఓ ఎంబుక్కులో రికార్డ్ చేసి స్వయానా సంతకం కూడా చేశారు. కానీ ఇదంతా బోగస్ వ్యవహారమే. అసలు కొత్త బోరును మార్చకుండానే దొంగ బిల్లులు, అధికారులు సైతం బోరు మార్చినట్టు రికార్డులు సృష్టించి ప్రజాధనాన్ని మింగేశారు. జరిగిన విషయం వెలుగులోకి రావడంతో ఆ మండల మాజీ టీడీపీ ఎంపీపీ మురళి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో పచ్చనేత మింగిన విషయం బయటపడింది. దీంతో విధిలేక కొత్త మోటార్‌ను జనం చూసేలా మంగళవారం బాగున్న బోరులోనే బిగించాల్సి వచ్చింది. ఇదే పరిస్థితి మిగిలిన మండలాల్లోనూ సాగుతోంది. అధికారులు కేవలం పచ్చనేతలు చెప్పినట్టు వింటున్నారే గాని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను ఏమాత్రం పట్టించుకోవడం లేదనే మాట మండల మీట్ల సాక్షిగా తేటతెల్లమైంది. దీనిపై జిల్లా అధికారులు చొరవ చూపి ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

పలమనేరు మండలంలో ఇలా...

మండలానికి సంబంధించి గతంలో జరిగిన మండల మీట్‌లో ఎంపీపీ నాలుగు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఇందులో జగమర్ల మంచినీటి సరఫరా, కురప్పల్లిలో సీసీ రోడ్డు, బయ్యప్పగారిపల్లిలో పైపులైన్ ఏర్పాటు. ఇందుకోసం ఈ రెండు నిధుల ద్వారా రూ.55లక్షలు మంజూరైంది. అయితే కూటమి నేతల ఒత్తిళ్లతో పలమనేరు ఎంపీడీఓ ఖాదర్‌బాషా ఈ పనులకు ఆమోదం తెలుపలేదు. దీంతో ప్రజాప్రతినిధులు కలెక్టర్ సైతం ఫిర్యాదు చేసినా లాభం లేకుండా పోయింది. దీనిపై మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు, మొరం సర్పంచ్ విశ్వనాథరెడ్డి పిటిషనర్‌గా పీఆర్ అండ్‌ఆర్‌డీ ఉన్నతాధికారుతోపాటు ఎంపీడీఓలపై హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు న్యాయమూర్తులు గతంలో తీర్పును వెలువరించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ పెండింగ్‌లోని నిధులను నెలరోజుల్లో ఖర్చు చేసి అక్కడి మండల బాడీ తీర్మానించిన పనులు చేపట్టాలని తీర్పులో ఆదేశించారు. అయితే ఎంపీడీఓ మాత్రం ఈ పనులకు డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూషన్ పేరిట అధికారులు పనులు చేపట్టేలా ఉన్నతాధికారుల ద్వారా ఆదేశాలు జారీ చేయించి కూటమి నేతలకు పనులను అప్పగించారు. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలను సైతం ఎంపీడీఓ ఖాతర్ చేయలేదు.

నోటీస్ బోర్డు

● నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేడు ఆర్టీసీ డీఎంతో డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉదయం 11 నుంచి 12 గంటల దాకా జరుగుతుందని స్థానిక డీఎం టీకే స్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీకి సంబంధించి ఏమైనా సమస్యలుంటే 9959225678 అనే నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తవణంపల్లె: డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రీడ్స్ సంస్థ డైరెక్టర్ థియో స్టీఫెన్, కో–ఆర్డినేటర్ కోదండపాణి తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఐరాల మండలంలోని సెయింట్ స్టీఫెన్ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, అలాగే అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కూడా కల్పించనున్నట్టు చెప్పారు. శిక్షణానంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. దీనిని జిల్లాలోని డీఎస్సీ పేద అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన సెల్ నంబర్: 9908260007.

రైతులకు విరివిగా రుణాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగరాజు

గుడుపల్లె: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన రుణాలను సహకార సంఘం బ్యాంకులో అందించాలని జిల్లా సహకార సంఘం ఇన్‌స్పెక్టర్ మురళీ మోహన్ తెలిపారు. గురువారం స్థానిక సహకార బ్యాంకులో రైతులకు రుణాలు ఇవ్వడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలను గుర్తించి, వారికి అవసరమైన రుణాలు అందిస్తామన్నారు. సహకార బ్యాంకుల్లో రైతులకు ఏఏ రుణాలు ఇస్తారో వాటి ఉపయోగాలపై తెలియజేశారు. అగ్రికల్చర్ రుణాలు తీసుకునేందుకు రైతులకు కావలసిన హామీ పత్రాలను అందించారు. ఏఓ నాగరాజు, సింగిల్‌విండో సీఈఓ దిలీప్ రామమూర్తి, డీసీసీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్ రైతులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పంచాయతీల అభివృద్ధి


గాంధీ చిత్రపటం వద్ద నేతల నివాళి

వి.కోట: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పంచాయతీల అభివృద్ధి ఎన్నడూ లేని విధంగా ముందుకు సాగిందని ఎంపీపీ యువరాజు, సర్పంచ్ పీఎస్ లక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని సచివాలయం–1లో సర్పంచ్ పీఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీడీఓ ఈశ్వరయ్య, ఈఓ శివశంఖర్, వైస్ ఎంపీపీ తమీమ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వార్డు మెంబర్లు వేణుఆచ్చారి, కుమార్‌రాజా పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో జెడ్పీ చైర్మన్, వెంకటేగౌడ


పూజల్లో జెడ్పీ చైర్మన్


పూజల్లో వెంకటేగౌడ


వి.కోట : మండలంలోని పాముగానిపల్లి పంచాయతీ గుమ్మిరెడ్డిపల్లిలో గ్రామస్తులచే పెద్దపులి గంగమ్మ ఆలయ నిర్మాణం చేశారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, కుంభాభిషేకం నిర్వహించి పెద్దపులి గంగమ్మ విగ్రహా ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వేరువేరుగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

కశ్మీర్ మృతులకు నివాళి


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సభ్యులు

పలమనేరు: కశ్మీర్‌లో ఉగ్రవాదుల తూటాలకు బలైన మృతులకు స్థానిక రిక్రియేషన్ క్లబ్ సభ్యులు గురువారం సాయంత్రం నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. విహారయాత్రకు వెళ్లిన యాత్రికులపై పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని జాతీయ అవార్డు గ్రహీత ఆర్ శ్రీనివాసులు రెడ్డి, టీకే షణ్ముగం ఇంటి సంపత్ అన్నారు. ఇందులో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా నేడు ఉదయం 10గంటలకు పీపీఎస్, న్యాయవాదుల సంఘం, మాజీ సైనికోద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించి స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద మృతులకు నివాళులర్పిస్తున్నట్టు పీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

● పరామర్శ


క్రిష్టప్పను పరామర్శిస్తున్న వెంకటేగౌడ

పెద్దపంజాణి: రాజుపల్లి ఎంపీటీసీ మునీశ్వరి భర్త క్రిష్టప్ప ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద ఉంటున్నారు. విషయం తెలిసి వెంకటేగౌడ కమ్మినాయునిపల్లికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. అదేవిధంగా చామనేరు పంచాయతీ బండకుంట గ్రామానికి చెందిన నూతన వధూవరులు వరలక్ష్మి, గణేష్‌లను పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ గురువారం ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా వస్తువుల వితరణ



క్రీడా వస్తువులు అందజేస్తున్న దాత నాగరాజు

కుప్పంరూరల్: అంతర్ జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు క్రీడా వస్తువులు ఉచితంగా అందజేశారు. రూ.30 వేలు విలువ చేసే పరికరాలు, దుస్తులను గురువారం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారానే పట్టుదల, ఏకాగ్రత, మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం సాధ్యమవుతుందన్నారు. చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేష్ ఈ సందర్భంగా దాత నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్‌ప్రిన్సిపల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

బియ్యం కార్డులు ఇవ్వండి


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రొంపిచెర్ల: అర్హులకు బియ్యం కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని గ్రామస్తులు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డిని కోరారు. గురువారం రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా ఇంత వరకు బియ్యం కార్డులు, పింఛన్లు మంజూరు చేయలేదని చెప్పారు. వెంటనే మంజూరు చేయాలని కోరారు. త్వరలోనే బియ్యం కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇస్తుందని ఎంపీడీఓ తెలియజేశారు. రొంపిచెర్ల సర్పంచ్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శులు సత్యంరెడ్డి, దశరథశేఖర్‌రెడ్డి, హరిబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెడికల్ షాపు సీజ్

కుప్పం: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నడుపుతున్న మెడికల్ షాపును డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన సీజ్ చేశారు. గురువారం ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులో ఏఆర్ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న మెడికల్ షాప్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అయితే మెడికల్ షాపునకు ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో రూ.2.5 లక్షల విలువ చేసే మందులను ఆమె సీజ్ చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖ సమక్షంలో సీజ్ చేసిన మందులను తరలించారు. అక్రమంగా మెడికల్ షాపులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

విద్యుత్‌షాక్‌తో మహిళకు గాయాలు

నెలరోజులుగా పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు


గాయపడిన హేమావతి

బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లె పంచాయతీ పరిధిలోని కొత్తయిండ్లలో నెలరోజులుగా విద్యుత్ షాక్‌తో పలువురికి తీవ్ర గాయాలై ఆస్పత్రుల పాలవుతున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం రాత్రి గ్రామస్తులు నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన శివకుమార్ భార్య హేమావతి (23) గురువారం రాత్రి 9 గంటల సమయంలో స్విచ్ ఆఫ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో గ్రామస్తులతో పాటు కుటుంబసభ్యులు బైరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సరైన వైద్యం లేకపోవడంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి వెళ్లేందుకు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు కారులో హేమలతను కుప్పం పీఈఎస్‌కు తీసుకెళ్లారు. గత నెలరోజులుగా గ్రామంలో విద్యుత్ సమస్య నెలకొన్నా ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా పెను ప్రమాదం సంభవించకముందే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులుకోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

సదుం: తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి గురువారం కోరారు. ఈ ఏడాది పదిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆయన తెలిపారు. 119 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 100 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన చెప్పారు. ఇందులో 14 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారని తెలియజేశారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు, ఉచితంగా మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలను అందజేస్తామన్నారు.

నాడు-నేడుతో మట్టిలో మాణిక్యాలు

- పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- నాడు–నేడు ద్వారా గత ప్రభుత్వంలో మెరుగైన సౌకర్యాలు, బోధన
- సర్కారు బడుల్లో మంచి ఉత్తీర్ణతకు ఇదే కారణం


గత ప్రభుత్వ హయాంలో రూపురేఖలు మారి కార్పొరేట్ స్కూళ్లను తలపిస్తున్న పలమనేరు బాలికోన్నత పాఠశాల

పలమనేరు: పది పరీక్ష ఫలితాల్లో పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు సత్తాచాటాయి. ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించాయి. గత ప్రభుతం నాడు–నేడు ద్వారా సర్కారు బడులను బాగా అభివృద్ధి చేసింది. విద్యార్థులకు అవరసమైన మౌలిక సదుపాయాలతోపాటు జగనన్న విద్యాకానుక ద్వారా పిల్లలకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, షూలు అందించింది. ఉత్తమ విద్యాబోధన, మెరుగుపడిన సౌకర్యాలతో పిల్లలు నేడు మంచి ఫలితాలను సాధించి మట్టిలో మాణిక్యాలుగా వెలుగుచూశారు.

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పలమనేరు మండలం మొత్తానికి 70శాతం ఉత్తీర్ణత సాధించి టాప్‌లో నిలిచింది. ఆపై గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట...

నియోజకవర్గంలో నాడు నేడు ఫేజ్–1 ద్వారా 113 బడులకు రూ.27.31కోట్లు వెచ్చించారు. ఫేజ్–2 ద్వారా 291 బడులకు రూ.118.06కోట్లను ఖర్చుపెట్టారు. మొత్తం మీద 404 పాఠశాలలకు రూ.145.37 కోట్లను వెచ్చించి సర్వాంగ సుందరంగా మార్చేశారు. నియోజకవర్గంలోని మొత్తం బడుల్లో 2023లో 48, 200మంది విద్యార్థులుండగా 2024లో కొత్త అడ్మిషన్లు 3వేలు పెరిగి విద్యార్థుల సంఖ్య 51వేలకు చేరింది.

నియోజకవర్గంలో పది ఫలితాలు ఇలా

మండలం	టాపర్ పేరు	మార్కులు	ఉత్తీర్ణత శాతం
పలమనేరు	భావన	588	70
పెద్దపంజాణి	సుమశ్రీ	587	68
బైరెడ్డిపల్లి	కౌసిక్	585	67
గంగవరం	హారతి	576	68
వి.కోట	రితికా	584	67

ఈ ఫలితాలు నాడు–నేడు ఫలితమే

నేను టీచర్‌గా పనిచేసిన బడిలో పిల్లల కష్టాలు, సౌకర్యాలు లేని పాఠశాలలు కళ్లతో చూసి ఎంతో బాధపడేవాన్ని. కానీ గత జగన్ ప్రభుత్వ పాలనలో బడులు బాగుపడ్డాయి. ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో పిల్లలు మంచి మార్కులు తెచ్చుకున్నారంటే అది నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనే కారణం.

పుష్పరాజ్,
రిటైర్డ్ టీచర్, పలమనేరు

మంచి ఫలితాలు వచ్చాయి

ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్యాబోధన నేటి ఫలితాల్లో కనిపించింది. కార్పొరేట్ స్కూళ్లను మించిన సౌకర్యాలు ఇప్పుడు మన బడుల్లో ఉన్నాయి. పిల్లలకు తల్లిదండ్రులందించే నిజమైన ఆస్తి చదువేనని ప్రభుత్వం భావించింది. ఓ రాష్ట్రం బాగుపడాలంటే పాఠశాలలపై ఆధారపడి ఉంటుంది. ఇప్పుడొచ్చిన ఫలితాలతో పిల్లల తల్లిదండ్రులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లీలారాణి, ఎంఈఓ, పలమనేరు